www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 80 | | 3-9-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోండి!



- హైకమాండ్ ఎదుటే కొండా సురేఖ సంచలన సవాల్
- నాపై చర్యలకంటే ముందు సీఎం వ్యవహారంపై విచారణ చేయాలి
- 'పదేళ్లు నేనే సీఎం' అని ఎలా చెబుతారు?
- రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా?

2

## రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం

2





# 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో రక్షణ ఎక్స్‌పో

## ప్రారంభించాలంటూ రాజ్‌నాథ్‌కు రేవంత్ ఆహ్వానం

- డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్
- ఎయిర్‌షోకు సూర్యకిరణ్, సారంగ్ బృందాలను కోరిన సీఎం
- త్రివిధ దళాల అత్యాధునిక వ్యవస్థల ప్రదర్శనకు విజ్ఞప్తి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు హాజరుకావాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే 'రక్షణ ఎక్స్‌పో-2026'ను ప్రారంభించాలని కోరారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సును నిర్వహించనున్నట్లు వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రాజ్‌నాథ్‌సింగ్‌తో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మిగతా 2 లో

## విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి

కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సీఎం రేవంత్ భేటీ

2



## మరో పదిమంది నకిలీ వైద్యులు

వివిధ ప్రాంతాల్లో దాడి చేసి పట్టుకున్న పోలీసులు

2



## రంగంలోకి మిలిటరీ ఇంటెలిజెన్స్

- ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కలకలం
- 12 ఆయుధాలు.. 1,912 తూటాలు మాయం
- 'ఇంటి దొంగల' ప్రమేయంపైనా అనుమానం
- సీసీ కెమెరాలో అనుమానాస్పద బైక్
- పలువురు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

2



## కూకట్‌పల్లిలో భూముల ధరలకు రెక్కలు

- గజానికి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయం

3



## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

3

కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు

కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు
- ఇరాక్, జోర్డాన్ వైపు ఇరాన్ క్షిపణులు
- కువైట్, బహ్రెయిన్‌లోనూ పేలుళ్ల కలకలం
- 13 క్షిపణులను కూల్చేశామన్న జోర్డాన్
- అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక

4

## అంతుచిక్కని ప్రకృతి విలయం

- 1127కి చేరిన వరద మృతుల సంఖ్య



.. వివరాలు 4లో

## వెయ్యి రోజుల పాలన.. దగా పాలన!

- అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం: కేటీఆర్
- మేనిఫెస్టోనే శతాబ్దపు అతిపెద్ద మోసమని విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ.. ఉద్యోగాలు.. పెన్షన్లలో మోసమేనని ధ్వజం
- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల

3





## 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

- పునర్వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో
- 30 వేలకు పడిపోనున్న ఉద్యోగుల సంఖ్య

4





# మరో పదిమంది నకిలీ వైద్యుల పట్టివేత

## వివిధ ప్రాంతాల్లో దాడి చేసి పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరి కొందరు నకిలీ డాక్టర్లను పట్టుకున్నారు. అర్హత లేకపోయినా డాక్టర్ల అవతారమెత్తి క్లినిక్‌లు నడుపుతున్న 10 మంది ఫేక్ డాక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ మెరుపు దాడుల వివరాలను కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి వెల్లడించారు. మేడ్చల్ - మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో నకిలీ క్లినిక్‌ల దందా విచ్చలవిడిగా సాగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. పేట్ బషీరాబాద్, మేడ్చల్, జగద్గిరిగుట్ట, సూరారం, పటాన్ చెరు, ఆర్‌సీ పురం తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో దాడులు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 నకిలీ క్లినిక్‌లను సీజ్ చేశారు. కేవలం టెన్త్, ఇంటర్, బీకామ్ వంటి చదువులు మాత్రమే చదివిన ఈ కేటుగాళ్లు, ఎలాంటి కనీస మెడికల్ నాలెడ్జ్ లేదా గుర్తింపు పొందిన డిగ్రీలు లేకుండానే క్లినిక్‌లు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారని విచారణలో తేలింది. ఎలాంటి అర్హత లేకున్నా క్లినిక్‌లలో ఏకంగా బెడ్లు ఏర్పాటు చేసి, అమాయక రోగులకు, చిన్నపిల్లలకు సైతం వైద్యం అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో వచ్చే పేషెంట్లకు ఎడాపెడా సెలైన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తూ ప్రాణాలపైకి తెస్తున్నారని పోలీసులు తెలిపారు. దాడుల సమయంలో ఈ క్లినిక్‌ల నుంచి పెద్ద ఎత్తున బీపీ మిషన్లు, స్టెతస్కోప్‌లు, గ్లూకోజ్ టెస్టింగ్ మిషన్లు, సిరంజీలతో పాటు భారీగా గడువు తీరిన ఔషధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి మాట్లాడుతూ.. నకిలీ డాక్టర్ల వల్ల రోగుల ప్రాణాలకు తీవ్రమైన ముప్పు ఉందన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చికిత్స కోసం వెళ్లే ముందు సదరు వైద్యులకు సరైన మెడికల్ సర్టిఫికేషన్లు, అర్హతలు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలాంటి అర్హత లేని వ్యక్తులు క్లినిక్‌లు నడుపుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రంగంలోకి దిగిన మిలిటరీ ఇంటిలిజెన్స్

## ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** సికింద్రాబాద్ బొల్లారం ప్రాంతంలోని 20 మద్రాస్ ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఆర్మీ అంతర్గత విచారణతో పాటు హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. తాజాగా కేంద్ర మిలటరీ ఇంటెలిజెన్స్ కూడా రంగంలోకి దిగింది. ఆయుధాల చోరీ వెనుక బయటి వ్యక్తులతో పాటు లోపలి వ్యక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ సాగుతోంది. ఆగస్టు 30 రాత్రి నుంచి 31వ తేదీ తెల్లవారుజాము మధ్య చోరీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆర్మరీలోని ఆయుధాల పెట్టెల తాళాలు పగులగొట్టి ఒక ఇన్సాస్ రైఫిల్, నాలుగు ఏకే-47లు, ఆరు పిస్టళ్లు సహా మొత్తం 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. వీటితో పాటు 21 మ్యాగజైన్లు, 1,912 రౌండ్ల తూటాలు, నైట్ విజన్ బైనాక్యులర్ కూడా చోరీకి గురైనట్లు తెలుస్తోంది. కట్టుదిట్ట మైన భద్రత ఉండే సైనిక స్థావరంలోకి ప్రవేశించి ఆయుధాగారాన్ని గుర్తించడం, తాళాలు పగులగొట్టి ఇంత పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తరలించడం సాధారణ దొంగలకు సాధ్యం కాదని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఇది 'ఇంటి దొంగల' పనే అయి ఉండొచ్చన్న కోణంలో మల్కాజిగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సెక్యూరిటీ ప్లాన్, ఆయుధాల నిల్వ ప్రాంతాలపై అవగాహన ఉన్న వ్యక్తుల సహకారం ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మిల్కా సింగ్ గ్రౌండ్ సమీపంలోని కెమెరాల్లో తెల్లవారుజామున 3.48 గంటలకు ఓ అనుమానాస్పద బైక్ కనిపించినట్లు సమాచారం. ఆ బైక్‌కు చోరీతో సంబంధం ఉందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రెజిమెంట్ ప్రహరీ సమీపంలో ఓ మ్యాగజైన్ కూడా లభించింది. ఇప్పటికే సుమారు 12 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సిబ్బంది ప్రమేయం, సంఘవిద్రోహ శక్తుల కుట్ర తదితర కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ఆయుధాల రికవరీతో పాటు భద్రతా వైఫల్యాలపై ఆర్మీ అధికారులు విచారణ జరుపుతున్నారు.

# వెయ్యిరోజుల అభివృద్ధిపై చర్చకు రండి

## బిఆర్ఎస్‌కు మంత్రి అడ్లూరి సవాల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు సంబంధించి బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి లిస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు వాట్సాప్‌లో పంపిస్తున్నట్లు చెప్పారు. ఛార్జ్‌షీట్ కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌లో అబద్దాలు మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను హరీశ్ రావు, కేటీఆర్, కేసీఆర్‌కు రిపోర్ట్ పంపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు కూడా ఇస్తున్నామని చెప్పారు. 'మాకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. అప్పుడే కేటీఆర్‌కు తొందర ఎందుకు' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 2014-18 మ్యానిఫెస్టో, కాంగ్రెస్ 2023 మ్యానిఫెస్టోపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. 'మీ పదేళ్ల పాలన, మా రెండున్నరేళ్ల పాలనపై దమ్ముంటే చర్చకు రండి' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు.

# 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో రక్షణ ఎక్స్‌పో

మొదటి పేజీ తరువాయి

ఎక్స్‌పో నిర్వహణతో పాటు తెలంగాణలో రక్షణ రంగానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సులతో పాటు భారీ ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం వివరించారు. ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, అంకుర సంస్థలు, యువ శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని కోరారు. ఎయిర్‌షోకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళ విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ విన్యాస బృందాలు పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విమానాల స్థిర ప్రదర్శన ఏర్పాటుకూ సహకరించాలని కోరారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఎక్స్‌పోలో ప్రదర్శించాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు సదస్సులో భాగస్వాములు కావాలని సీఎం కోరారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు డీఆర్‌డీవో ప్రయోగశాలలు విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించేలా సహకరించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ ప్రతినిధులు, ద్వైపాక్షిక ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాల ఏర్పాటుకూ కేంద్రం సహకారం కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ చేపట్టినట్లు రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం వివరించారు. రక్షణ శాఖ మొత్తం 1,500 ఎకరాలు కోరిన నేపథ్యంలో మరో 750 ఎకరాలను సేకరించి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాలు కేటాయించేందుకు టీజీఐఐసీ ఇప్పటికే అంగీకరించిందని వివరించారు. మొత్తం భూమికి ఏడాదికి రూ.1 నామమాత్రపు లీజుతో 33 సంవత్సరాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే మరో రెండుసార్లు లీజును పొడిగించుకునే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.



# విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:** తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే పైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోండి!

## హైకమాండ్ ఎదుటే సురేఖ సంచలన సవాల్

## నాపై చర్యలకంటే ముందు సీఎం వ్యవహారంపై విచారణ చేయాలి

## 'పదేళ్లు నేనే సీఎం' అని ఎలా చెబుతారు?

## రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపైనా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రిపై నేరుగా విమర్శలు చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తానే పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని బహిరంగంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లోని పలువురు మంత్రులపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయని, అయితే తన విషయంలో మాత్రమే చర్యల మాట ఎందుకు వస్తోందని నిలదీశారు. ముఖ్యమంత్రిపై మంత్రులు, పార్టీ నేతల్లోనూ అసంతృప్తి ఉందని వ్యాఖ్యానించారు. తనను ఇప్పటివరకు రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని, పార్టీ అధిష్ఠానానికి అన్ని విషయాలను రాతపూర్వకంగా వివరించినట్లు తెలిపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను ఎందుకు బాధ్యురాలిని చేస్తున్నారని ప్రశ్నించారు. ఇతర సామాజిక వర్గాలకు చెందిన పలువురు నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. "రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా?" అంటూ కొండా సురేఖ ప్రశ్నించారు. తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రినని, తన విషయంలో మాత్రం కఠిన చర్యలపై చర్చ జరుగుతుండటం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు, పార్టీ పెద్దలందరికీ తన వాదనను లిఖితపూర్వకంగా వివరించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని కూడా అధిష్ఠానం సమగ్రంగా పరిశీలించాలని ఖర్గేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కొండా సురేఖ తాజా వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఢిల్లీలో రాజీ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో కొండా సురేఖపై చర్యలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్ఠానానికి నివేదిక పంపినట్లు సమాచారం. అధిష్ఠానం నిర్ణయంపై తాను వేచి చూస్తున్నానని, పార్టీ తీసుకునే నిర్ణయాన్ని గమనిస్తానని సురేఖ తెలిపారు. అయితే తనపై మాత్రమే చర్యలు తీసుకోవడం కంటే, పార్టీలోని అన్ని అంశాలను ఒకే ప్రమాణంతో పరిశీలించాలని ఆమె చేసిన డిమాండ్ ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.



# రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

## మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం

**హైదరాబాద్,సెప్టెంబర్ 2:** తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది. తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు. మరోవైపు.. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లారు. దీంతో రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకునే అవకాశం చాలామందికి లేకుండా పోయింది. చివరి రోజుల్లో రేషన్ షాపుల వద్ద రద్దీ కూడా పెరగడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ.. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మూడు నెలల బియ్యం కోటాను కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించింది. తాజాగా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో 3 నెలల బియ్యం కోటాను తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు తీసుకోని అర్హులైన కార్డుదారులు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత బియ్యం పంపిణీపై మరింత అవకాశం ఉండకపోవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఇంకా కోటా తీసుకోని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా సమీప రేషన్ దుకాణానికి వెళ్లి తమకు కేటాయించిన బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. 3 నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడం వల్ల ఏర్పడిన రద్దీ, పండుగ కారణంగా లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం గడువు పొడిగించడం రేషన్ కార్డుదారులకు ప్రయోజనకరంగా మారింది. దీంతో రేషన్ బియ్యం తీసుకోలేని వారికి మరో అవకాశం లభించింది.



# వెయ్యి రోజుల పాలన.. దగా పాలన!

- అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం: కేటీఆర్
- మేనిఫెస్టోనే శతాబ్దపు అతిపెద్ద మోసమని విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ.. ఉద్యోగాలు.. పెన్షన్లలో మోసమేనని ధ్వజం
- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల




**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ఇది వెయ్యి రోజుల ప్రజాపాలన కాదు.. పీడన పాలన. ఎటు చూసినా విధ్వంసం, వికృతమే కనిపిస్తోంది. జలద్రోహం చేస్తున్న జలగల పాలన ఇది" అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై రూపొందించిన ఛార్జ్‌షీట్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను "ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం"గా అభివర్ణించారు. ఆరు గ్యారంటీలు, వందలాది హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండానే ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప వెయ్యి రోజుల్లో సాధించింది ఏమీ లేదన్నారు. రైతులకు రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి అందులో కొంత మొత్తంతోనే సరిపెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి దేవుళ్లపై ప్రమాణాలు చేసినా పెద్ద సంఖ్యలో రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందలేదన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా తీర్చిదిద్దితే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. రైతుబంధు నిలిచిపోయిందని, యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రాజకీయ కక్షతో రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. ఇతర కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించేందుకు మాత్రం ముందుకు రావడం లేదని విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ నీటి హక్కులకు నష్టం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఎస్ఎల్‌బీసీ, చెక్‌డ్యామ్‌ల అంశాల్లో కేంద్ర సంస్థలు స్పందించడం లేదని విమర్శించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో తెలంగాణ ప్రాజెక్టుల ప్రయోజనాలను బలంగా వినిపించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ ఉద్యోగ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు తెలంగాణలో నిరుద్యోగుల ఆందోళనలను అణచివేస్తున్నారని ఆరోపించారు. పేదల భూములను నిషేధిత జాబితాల్లో చేర్చి వాటి పరిష్కారం పేరుతో కమీషన్లు తీసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోందని, రాష్ట్ర సంపద విషయంలోనే విభేదాలు బయటపడుతున్నాయని వ్యాఖ్యానించారు. "అసమర్థతలో ప్రో మ్యాక్స్.. అవినీతిలో అల్టిమేట్.. అరాచకంలో ఐమ్యాక్స్" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో అసలైన కాంగ్రెస్ లేదని, పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన నేతలను పక్కనపెట్టి మధ్యలో వచ్చిన వారికి పెద్దపీట వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ ప్రకటించింది. సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నిరసనలో మల్లారెడ్డి మాస్ స్టెప్పులు

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసనల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తనదైన శైలిలో సందడి చేశారు. యువకులతో కలిసి డ్యాన్స్ చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ హామీలపై విమర్శలు చేస్తూనే యువకులతో కలిసి మాస్ స్టెప్పులు వేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటూ తనదైన శైలిలో కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

# కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశాం

- రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉన్న అభివృద్ధి వైపుకు
- అప్పుల భారం ఉన్నప్పటికీ ముందుకు వెళుతున్నాం
- వెయ్యి రోజుల పాలన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్,సెప్టెంబర్ 2:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలన

## అన్ని వర్గాలకూ మోసమే
## ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధ్వజం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నివాసం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ ఛైర్మన్ ఎండి అహ్మద్, సింగిల్ విండో ఛైర్మన్ అలీ బీన్ అహ్మద్, కౌన్సిలర్లు సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, లక్ష్మి, నాగు బాయ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సరస్వతి, ఎమ్మెల్యే తనయుడు కోవా సాయినాథ్ , వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయిందని ఎండగడుతూ, ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలు, నెరవేర్చని హామీలను వివరిస్తూ రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన ఈ ర్యాలీలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నాయకులు, కార్యకర్తలు భారీ ఫ్లెక్సీని పట్టుకుని ప్రధాన వీధుల గుండా ప్రదర్శిస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వరకు చేరుకున్నారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద భారీ ధర్నా చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, ఇతర ఎన్నికల హామీలు కేవలం నీటి మూటలుగానే మిగిలిపోయాయి అన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. హామీల అమల్లో వైఫల్యాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి అబ్దుల్ కలాం, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, టౌన్ అధ్యక్షుడు అహమాద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ నిసార్, జీవన్ ,గుండా శ్యామ్, సాయి శ్రావణ్, ఖిజ్రానా బేగం, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.







# కూకట్‌పల్లిలో భూముల ధరలకు రెక్కలు

## గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ వచ్చింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఈ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయించడం హాట్‌టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో భూముల ధరలు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ వేలం మరోసారి స్పష్టం చేసింది. అధికారులు నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఒక్కో గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, వేలంలో పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగా పెరిగాయి. అత్యధికంగా ఒక ఎ÷-లాట్ గజం రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. మరో ఎ÷-లాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయించారు. అదేవిధంగా మరో రెండు ప్లాట్లు గజం రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. వేలంలో మొత్తం 19 మంది బిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాట్ల కోసం పోటీపడ్డారు. ఈ పోటీ కారణంగా హౌసింగ్ బోర్డు నిర్దేశించిన కనీస ధర కంటే అనేక ప్లాట్లు అధిక ధరలకు విక్రయమయ్యాయి. మొత్తం 16 ఎ÷-లాట్ల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది. వేలంలో గజం సగటు ధర రూ.1.79 లక్షలుగా నమోదైంది. కేపీహెచ్‌బీ ప్లాట్లకు భారీ డిమాండ్ ఉన్నట్లు ఈ వేలం ద్వారా మరోసారి వెల్లడైందని అధికారులు చెప్పారు. హైదరాబాద్‌లో కీలకమైన ప్రాంతాల్లో అందుబాటులోని హౌసింగ్ బోర్డు భూములకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని హౌసింగ్ బోర్డు ఎ÷-లాట్లకు కూడా పోటీ నెలకొంటోందని అన్నారు. వేలం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు అధికారులు వెల్లడించారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయం హౌసింగ్ బోర్డు ఆర్థిక వనరులను పెంచడంలో కీలకంగా మారనుందని తెలిపారు. కేపీహెచ్‌బీ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ ఎ÷-లాట్లకు భారీ డిమాండ్ ఉందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

## కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు
## నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు
## కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కుమ్ములాటలు కొత్తేమీ కావు..

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ అనేది ఒక విలక్షణమైన జాతీయ పార్టీ అని, పార్టీలో అభిప్రాయభేదాలు, అంతర్గత కొట్లాటలు ఉండటం సహజమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒకరికొకరి మధ్య విభిన్నమైన అభిప్రాయాలు ఉంటాయని అన్నారు. చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయని, అయితే ఆ చర్చలు లేదా వివాదాలు పరిమితులు దాటితే మాత్రం పార్టీ అధిష్ఠానం కచ్చితంగా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లను కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే పరిమితం చేయకుండా, అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉద్యమ కెరటం
నిజం నిక్కచ్చిగా UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
3 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం



# ఉగ్రవాదంపై పాక్‌కు మరోమారు హెచ్చరిక!

### ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదన్న మోదీ

### షెహబాజ్ సమక్షంలోనే ఘాటు వ్యాఖ్యలు

### ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చే దేశాలను ఉపేక్షించొద్దని పిలుపు

### సింధు జలాల అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని

### ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని భారత్ స్పష్టీకరణ

**ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించుకునే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, ఆర్థిక సహాయం అందించడం, తీవ్రవాద కార్యకలాపాలకు మద్దతివ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.**

సదస్సులో షెహబాజ్ షరీఫ్ సింధు జలాల అంశాన్ని ప్రస్తావించారు. భారత్ తీసుకున్న నిర్ణయాలతో పాకిస్థాన్‌లో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నదీ జలాలను రాజకీయాలకు ముడిపెట్టరాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఉగ్రవాదం అంశంపై భారత్ తన వైఖరిని మరోసారి గట్టిగా వినిపించింది. "ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాబోదు" అని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానాల అమలుకు సాధనంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాల విషయంలో ప్రపంచం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటులేదని అన్ని దేశాలు ఒకే గొంతుతో చెప్పాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు దేశాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, నియామకాలు చేపట్టడం, యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపైనా ఉమ్మడి పోరు అవసరమన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో మోదీ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ సైనిక చర్య చేపట్టిన అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని మోదీ పేర్కొన్నారు. అయితే అలాంటి ప్రాజెక్టులు ఆయా దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు. పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలతోనే ప్రాంతీయ సహకారం బలోపేతమవుతుందన్నారు. షాంఘై సహకార సంస్థ 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లతో ఏర్పాటైంది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరగా.. ఆ తర్వాత ఇరాన్, బెలారస్ సభ్యత్వం పొందాయి. ఉగ్రవాదంపై భారత్ కొంతకాలంగా అంతర్జాతీయ వేదికలపై కఠిన వైఖరిని వినిపిస్తోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వ్యవస్థలను సమూలంగా నిర్మూలించకుండా ప్రపంచ శాంతి, స్థిరత్వం సాధ్యం కాదన్న సందేశాన్ని షాంఘై సహకార సంస్థ వేదికగా మోదీ మరోసారి బలంగా వినిపించారు.



# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు
- ఇరాక్, జోర్డాన్ వైపు ఇరాన్ క్షిపణులు
- కువైట్, బహ్రెయిన్‌లోనూ పేలుళ్ల కలకలం
- 13 క్షిపణులను కూల్చేశామన్న జోర్డాన్
- అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక



**టెహ్రాన్, సెప్టెంబర్ 2:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య పరస్పర దాడులతో పరిస్థితి వేడెక్కింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేపట్టగా.. ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులకు దిగినట్లు ఇరాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాక్, జోర్డాన్ వైపు ఇరాన్ క్షిపణులను ప్రయోగించగా.. కువైట్, బహ్రెయిన్‌లోనూ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. అమెరికా దాడుల్లో భాగంగా ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో ఓ పెళ్లి వేడుక జరుగుతున్న ప్రదేశం దెబ్బతిన్నట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. ఈ ఘటనలో ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందగా, సుమారు 50 మంది గాయపడినట్లు తెలిపింది. అయితే ఈ ప్రాణనష్టం వివరాలపై స్వతంత్ర నిర్ధారణ రావాల్సి ఉంది. అమెరికా దాడులపై ఇరాన్ నాయకత్వం తీవ్రంగా స్పందించింది. అమెరికాకు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రతినిధి హుస్సేన్ మొహబి హెచ్చరించారు. దాడులు ఎందుకు చేశామా అని చింతించే పరిస్థితి తీసుకొస్తామని వ్యాఖ్యానించారు. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడికి ప్రయత్నించడంతోనే తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు దాడులు కొనసాగినట్లు తెలిపింది. తమ భూభాగం వైపు దూసుకొచ్చిన 13 బాలిస్టిక్ క్షిపణులను గగనతలంలోనే అడ్డుకుని ధ్వంసం చేసినట్లు జోర్డాన్ సైన్యం ప్రకటించింది. మరో మూడు క్షిపణులు నిర్మానుష్య ప్రాంతాల్లో కూలిపోయాయని తెలిపింది. ఈ దాడుల్లో తమ దేశంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడించింది. ఇరాన్ ప్రయోగించిన పలు క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్లు కువైట్ కూడా ప్రకటించింది. బహ్రెయిన్‌లోనూ పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా దాడుల్లో చిన్నారి సహా పౌరులు మరణించినట్లు ఇరాన్ మీడియాలో వచ్చిన కథనాలపై అమెరికా సెంట్రల్ కమాండ్ స్పందించింది. తాము ఉద్దేశపూర్వకంగా సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని పేర్కొంది. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష దాడులు, పొరుగు దేశాల గగనతలంలో క్షిపణుల కదలికలతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. తాజా పరిణామాలు మరింత విస్తృత ఘర్షణకు దారితీస్తాయేమోనన్న ఆందోళన నెలకొంది.

# అంతుచిక్కని ప్రకృతి విలయం

### 1127కి చేరిన వరద మృతుల సంఖ్య

### 4858 మంది కోసం ఇంకా గాలింపు

### డీఎన్ఏ టెస్టుల ద్వారా శవాల గుర్తింపు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్:** ప్రళయంలా విరుచుకుపడిన వరదలతో నేపాల్‌లో మరణమృదంగం కొనసాగుతోంది. ఊహించని విధంగా సంభవించిన ప్రకృతి విలయానికి అక్కడి ప్రజలు వేల సంఖ్యలో ప్రాణాలు వదిలారు. తాజా లెక్కల ప్రకారం వరద మృతుల సంఖ్య 1127కి చేరిందని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకూ ఆచూకి దొరకని వారి సంఖ్య కూడా సుమారు 5 వేల మందిపైగా ఉంటుందని అంచనా వేశారు.నేపాల్ వరదల్లో ఒక్క చిత్వాన్ జిల్లాలోనే అత్యధికంగా అంటే 348 మంది మృతదేహాలను వెలికితీశారు సహాయక బృందాలు. వారితో పాటు మరో 6,541 మందిని ప్రాణాలతో కాపాడి సురక్షిత ప్రదేశాలకు తరలించాయి రెస్క్యూ టీమ్స్. నేపాల్‌లో వరదలతో ఏర్పడిన విధ్వంసానికి సంబంధించిన చేదుజ్ఞాపకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొదట వెయ్యి మంది వరకు గల్లంతైనట్లుగా భావించిన అధికారులు ..ఇప్పుడు వరదల్లో చిక్కుకొని, గల్లంతైన వారిలో చనిపోయిన వారి సంఖ్యే 12 వందలకు చేరుకుంటోంది. 1127 మంది చనిపోయినట్లుగా నేపాల్ పోలీస్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఇక వరదల్లో గల్లంతై, బురదల్లో చిక్కుకుపోయిన వాళ్ల సంఖ్య కూడా 4858 మంది వరకు ఉన్నారని అక్కడి జనాభా లెక్కల ప్రకారం తెలుస్తోంది. మరీ ముఖ్యంగా చిత్వాన్ జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో మృతదేహాలను వెలికి తీశారు. గత వారం రోజులకుపైగా కొనసాగుతున్న సహాయకచర్యల్లో భాగంగా ఇప్పటి వరకు 348 మృతదేహాలను వెలికితీశారు. నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహుల జిల్లాల్లో కూడా చనిపోయిన వారి సంఖ్యలో వందల్లోనే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారు, గల్లంతైన వారితో పాటు తీవ్రంగా గాయాలపాలైన వాళ్ల కోసం కోసం రెస్క్యూ బృందాలు విస్తృతంగా శ్రమిస్తున్నాయి. 7,912 మంది పోలీసు సిబ్బంది వరదలు సంభవించిన 4 జిల్లాల్లో 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా రక్షించాయి. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. నేపాల్‌లో సంభవించిన వరదలు ఆకస్మిక వరదలు మాత్రమే కాదని రాకాసి వరదలుగా చూస్తున్నారు అక్కడి ప్రజలు.



# ఉక్రెయిన్‌పై దాడిలో జగిత్యాల వాసి మృతి

**జగిత్యాల, సెప్టెంబర్ 2:** ఉక్రెయిన్‌పై రష్యా చేసిన భారీ దాడిలో జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్‌గౌడ్(42) మృతి చెందాడు. మంగళవారం ఉదయం తాను నివాసం ఉంటున్న గది నుంచి బయటకు వచ్చిన సమయంలోనే ఈ దాడి జరగడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు విడి చాడు. స్వగ్రామంలో సెంట్రింగ్ పని చేసిన సుదర్శన్‌గౌడ్ నాలుగు నెలల క్రితమే ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్ వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున కీవ్ సహా పలు ప్రాంతాలపై క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.. కాగా సుదర్శన్‌గౌడ్‌తో పాటు ఉక్రెయిన్‌లో ఉంటున్న తాటిపెల్లి గ్రామానికి చెందిన వేణు ద్వారా ఈ ఘటన గురించి మృతుడి కుటుంబసభ్యులకు తెలిసింది.

# నేపాల్‌లో మళ్లీ వర్షాలు

### ఉప్పొంగుతున్న మూడు ప్రధాన నదులు

**ఖాట్మాండ్, సెప్టెంబర్ 2:** నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటి వరకు 1,113 మృతదేహాలకు పోస్ట్‌మార్టం.. చట్టపరమైన గుర్తింపు పక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపులేని 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటి వరకు 6,541 మందిని రక్షించగా..4,858 మంది గల్లంతయ్యారు. 7,912 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు.

# ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

### పునర్వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో

### 30 వేలకు పడిపోనున్న ఉద్యోగుల సంఖ్య

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2:** ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.



# ఈ నెల 5 తేదీన జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశాలు

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, బీమా సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధులతో, మధ్యాహ్నం 12 గంటలకు పోలీసు, ఆబ్కారీ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవనంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద కేసులు, ఎన్.ఐ. యాక్ట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# ఆసిఫాబాద్ కోర్టులో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ అనూష పాల్గొని న్యాయవాదులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి మాట్లాడుతూ కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఉండాలని, అప్పుడే ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనమందరం దేశానికి రక్ష అనే భావనతో ప్రతి ఒక్కరూ మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొనగిరి సతీష్ బాబు, ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ నాయక్, న్యాయవాదులు నరహరి, చరణ్ తేజ, ఆకాష్, అంజనీ దేవి, విద్యాసాగర్ పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ నోటీసుపై విచారణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మండలంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 227 పరిధిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అజ్మీరా శ్యామ్‌కు వచ్చిన ప్రత్యేక సమాచార రివిజన్ (ఎస్ ఐ ఆర్) అనామలీస్ నోటీసుకు సంబంధించి అధికారులు మంగళవారం హియరింగ్ (విచారణ) నిర్వహించారు. ఈ ప్రక్రియలో వార్డు సభ్యుల ఫోరం జిల్లా కన్వీనర్ గులాం జావిద్, ఆర్ఐ శ్రీనివాస్, జిపిఓ వామన్, బీఎల్ఓలు శ్రీలక్ష్మి, శ్రీలతలతో కూడిన అధికారుల సమక్షంలో అజ్మీరా శ్యామ్‌కు సంబంధించిన పూర్తి ఆధార పత్రాలను (డాక్యుమెంట్లు) సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిజాం, శశి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ సాగుతో అధిక దిగుబడులు



**ఉద్యమ కెరటం, తాండూర్:** రైతులు సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే బెల్లంపల్లి శాస్త్రవేత్తల బృందం సభ్యులు సూచించారు. బుధవారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని కిష్టంపేట, రేపల్లెవాడ గ్రామాల్లో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.పత్తి పంటలో కలుపు సమస్యను పరిశీలించిన శాస్త్రవేత్తలు, కలుపు నివారణకు క్విజాలోఫాప్ ఇథైల్, పైరిథియోబాక్ సోడియం ఎకరాకు 250 మి.లీ. చొప్పున వినియోగించాలని తెలిపారు. అనంతరం వరి పొలాలను పరిశీలించి సమస్యాత్మక నేలల్లో నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచకుండా అవసరాన్ని బట్టి పొలంలోని నీటిని బయటకు తీసి, తిరిగి నీరు అందించే విధానాన్ని పాటించాలని పేర్కొన్నారు. ఈ క్షేత్ర సందర్శనలో డాక్టర్ మధు, ఎన్.మహేష్, పి.సాధ్వి, తాండూర్ మండల వ్యవసాయ అధికారి సుష్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేష్, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో మెరుగైన ఫలితాలకు సమష్టి కృషి అవసరం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ఆశించిన ఫలితాలు సాధించేందుకు అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల మోడల్ స్కూల్‌లో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాల నాణ్యత, సమానత్వం, ప్రాప్యత, జవాబుదారీతనం అంశాలలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. యు-డైస్+ లో పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. విద్యార్థుల విద్యా వివరాలను డిజిటల్ రూపంలో నిర్వహించేందుకు అపార్ ఐడీ నమోదు, ఆధార్ వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ ఆర్ ఎస్) హాజరును క్రమం తప్పకుండా వినియోగించేలా ఎం ఈ ఓ లు, ఎచ్ ఎం లు బాధ్యత వహించాలని సూచించారు. విద్యార్థుల్లో చదువుతో పాటు మానసిక, సామాజిక, నైతిక విలువలను పెంపొందించాలని, ఎఫ్ ఎల్ ఎన్, ఖాన్ అకాడమీ, ఏ ఐ ఆధారిత అభ్యసన విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్లానింగ్ కో-ఆర్డినేటర్, క్వాలిటీ కో-ఆర్డినేటర్, ఏ పి ఓ, ఏ ఎస్ ఓ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయంలో అరిగెల ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** మండలంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో బుధవారం భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరరావు హనుమాన్ దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శిరీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.పూజా కార్యక్రమాల అనంతరం దీక్ష చేపట్టిన హనుమాన్ స్వాములకు, భక్తులకు ప్రత్యేకంగా భిక్షా కార్యక్రమం ఏర్పాటు చేశారు. అరిగెల నాగేశ్వరరావు ఇతర నాయకులు, భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, జిల్లా వైద్యాధికారి నాగేంద్ర, ప్రముఖ వ్యాపారవేత్తలు తాటిపల్లి దిలీప్, గుండా వెంకన్న, సాయిని నరసింహులు, అనర్థం తిరుపతి, భాజపా నాయకులు సుంకరి పెంటయ్య, ప్రసాద్ గౌడ్, గాజుల రాజేంద్రప్రసాద్, మేకర్తి లచ్చన్న, గాజుల సత్యనారాయణ, శ్రీకాంత్, మురళి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రాఖీ పండుగ వేళ సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు రూ.2.01 కోట్ల ఆదాయం

- **డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు భారీగా ఆదాయం సమకూరింది.ఆగస్టు 26 నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల వ్యవధిలో మొత్తం రూ.2కోట్ల 1లక్ష 30వేల 786 ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు.రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ బస్సులతో పాటు అదనపు బస్సులను కూడా నడిపినట్లు తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేసినట్లు పేర్కొన్నారు.ఆరు రోజుల్లో సత్తుపల్లి డిపోకు చెందిన బస్సులు మొత్తం 3లక్షల 8వేల 183 కిలోమీటర్లు ప్రయాణించాయని తెలిపారు. వంద శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదవడంతో పాటు, ప్రతి కిలోమీటరుకు సగటున రూ.65 ఆదాయం వచ్చినట్లు వివరించారు.ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపడంతో డిపోకు అధిక ఆదాయం సమకూరిందన్నారు. ప్రాంతీయ రవాణా అధికారి ఏ.శిరిరామ్ సూచనల మేరకు సాధారణంగా నడిచే బస్సులకు అదనంగా 543 బస్సు సర్వీసులు నడిపినట్లు తెలిపారు.గత ఏడాది రాఖీ పౌర్ణమితో పోలిస్తే ఈ ఏడాది సుమారు రూ.10లక్షల అదనపు ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ, సహాయ ఇంజనీర్ సాహితి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలి

- **విద్యా సంస్థల ముందు రిఫ్లెక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలి**
- **వేగంగా దూసుకెళ్తున్న వాహనాలతో తల్లిదండ్రుల ఆందోళన**





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యా సంస్థల ముందు ప్రధాన రహదారిపై రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్ స్టాండ్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యా సంస్థలకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండగా, అదే ప్రధాన రహదారిపై వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉదయం పాఠశాల సమయాల్లో, పాఠశాలలు ముగిసే సమయంలో విద్యార్థుల రద్దీ అధికంగా ఉంటుందని, చిన్నారులు రహదారి దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనాల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై సరైన హెచ్చరికలు, రిఫ్లెక్టర్లు లేకపోవడంతో వాహనదారులకు విద్యార్థులు, పాదచారులు స్పష్టంగా కనిపించకపోయే పరిస్థితి ఉందని తెలిపారు.విద్యార్థులు రహదారి దాటే ప్రాంతాల్లో'స్కూల్ జోన్'.. 'వేగం తగ్గించండి'.. 'విద్యార్థుల రాకపోకలు జరుగుతున్నాయి..వంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. రిఫ్లెక్టర్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తే వాహనదారులు ముందుగానే అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.పాఠశాల సమయాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించాలని, అవసరమైతే ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అధికారులు వెంటనే స్పందించి కేజీ టు పీజీ విద్యా సంస్థల ముందు రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్ స్టాండ్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన రహదారి భద్రత చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ విఫలం

- **వెంటనే రాజీనామా చేయాలి: ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, బోథ్:** ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, వెయ్యి రోజుల్లో ఒక్కరోజు కూడా ఆయన ప్రజల్లోకి రాలేదని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గఇంచార్జి ఆడే గజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండల కేంద్రంలో బోథ్, సొనాల మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకునిఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆడే గజేందర్ మీడియాతో మాట్లాడుతూతెలంగాణలో ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా ప్రజా సమస్యలను, వారి సాధక బాధకాలను పట్టించుకోని కేసీఆర్, ఆ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా వ్యవహరించాల్సింది పోయి కాలయాపన చేస్తున్నారని, అందుకే ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కొనియాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని ఎన్నో పనులు, కేవలం వెయ్యి రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సాకారమవుతున్నాయని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తోందని, బోథ్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ నిరంతరాయంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, సొనాల మండల అధ్యక్షుడు గాజుల పోతన్న, రాష్ట్ర ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వినోద్ సింగ్, డీసీసీ కార్యదర్శి లోలపు పోశెట్టి, ఎల్మా వినయ్ రెడ్డి, మాజీ బ్లాక్ అధ్యక్షుడు నరసింహ దాస్, ఉపసర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు సుద్దలు అరుణ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చంటి, మాజీ బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ తదితర ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షల వైపు సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం ఇందిరనగర్ లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకుల హాజరు పట్టికలు, తరగతి గదులు, విద్యాబోధన తీరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులు 100 శాతం కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన కలిగే విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అనంతరం రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వల గది, రోగులు చికిత్స పొందుతున్న గదులను పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, చిన్నచిన్న కారణాలతో రోగులను ఇతర ప్రాంతాలకు సిఫారసు చేయకూడదని తెలిపారు. నెలలు నిండిన గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండి సుఖప్రసవానికి చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల క్రమశిక్షణకు యూనిఫాంలు దోహదం

**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రభుత్వం అందజేస్తున్నయూనిఫాంలు విద్యార్థుల క్రమశిక్షణకు ఎంతగానో దోహద పడతాయని సర్పంచ్ బాచావార్ లక్ష్మణ్ పటేల్ అన్నారు. మధన్ హిప్పర్గా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు అందించడంతో వారిలో సమానత్వ భావన పెంపొందడంతో పాటు పాఠశాల పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామోజి శ్రీవాస్తవ్, ఏఎంసీ చైర్మన్ గండిగె ఈరాబాయి, ఉపాధ్యాయులు చందు, శిల్ప, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు శారద, వీవోఏ బషవ్వ, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# సంక్షేమానికి చిరునామా వైఎస్సార్

- ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** సంక్షేమానికి చిరునామా వైఎస్సార్ అని చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డితో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్సార్ అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలిచారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా



సాధికారత వంటి అనేక రంగాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను వైఎస్సార్ హయాంలోనే ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు.కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో వైఎస్సార్ పాత్ర మరువలేనిదని అన్నారు. ఆయన హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, కాలువల కారణంగా జిల్లాలో వ్యవసాయం అభివృద్ధి చెందిందని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీతో పాటు కొండగట్టు, మంథనిలో జేఎన్టీయూ, కోరుట్లలో వెటర్నరీ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు ఆయన హయాంలోనే ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు.2009లో హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మృతిచెందడం అత్యంత బాధాకరమని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడుపు మోహన్, బానోతు శ్రావణ్ నాయక్, వరాల నర్సింగం, పర్వత మల్లేశం, అన్నమనేని నర్సింగారావు, వెన్న రజిత రెడ్డి, అహమ్మద్ అలీ, విక్టర్, వంగల విద్యాసాగర్, కుంభాల రాజకుమార్, మాదాసు శ్రీనివాస్, గంగుల దిలీప్, మూల కృష్ణారెడ్డి, కర్రె పావని, ఫజల్, హాజీ, వసీం, ఇమ్రాన్ గని, సుంకే రాజు, దాసరి సందీప్, తోట అంజయ్య, కుర్ర పోచయ్య, మల్లారెడ్డి, ఫహద్, స్వప్నశ్రీ, మాలోతు మహాలక్ష్మి, పెంట శేఖర్, రాచర్ల పద్మ, సిరిపురం నాగప్రసాద్, సత్తినేని శ్రీకాంత్, కాశిపాక రాకేష్, శిల్పా, కూస రవీందర్, సుంకరి గణపతి, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

- బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ లో గల ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటశాలను పరిశీలించిన విద్యార్థినులకు అందిస్తున్న అన్నం, పప్పు, చికెన్, వెజిటబుల్ కర్రీ, పెరుగు తదితర ఆహార పదార్థాల రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి అల్లూరి లక్ష్మణ్ ఆదేశాల మేరకు ప్రతి వారం ఒకటి, రెండు హాస్టళ్లను ఆకస్మికంగా సందర్శించి భోజన నాణ్యతను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం హాస్టల్‌లో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తూ వారిలో ఉత్సాహాన్ని



నింపారు. విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల నమోదు తప్పనిసరి

**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రభుత్వం పంటల కొనుగోళ్లకు డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదైన వివరాలను ప్రామాణికంగా పరిగణించే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జంగావ్ అగ్రికల్చర్ క్లస్టర్ ఏఈఓ రాజేందర్ నేత సూచించారు. బుధవారం జైనూర్ మండలంలోని జంగావ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అగ్రికల్చర్ వాలంటీర్లు రైతుల పొలాలను సందర్శించి పంటల వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. వాలంటీర్లు పొలాలకు వచ్చినప్పుడు రైతులు



తప్పనిసరిగా అందుబాటులో ఉండి సాగు చేస్తున్న పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. సర్వేలో పంటల వివరాల నమోదుపై రైతులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో నష్టపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం, సీసీఐ ద్వారా పత్తి సేకరణ చేపట్టడం వంటి సందర్భాల్లో సర్వేలో నమోదైన పంట వివరాలను ఆధారంగా తీసుకునే అవకాశం ఉందన్నారు.పంట నమోదు విషయంలో ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## పాము కాటుతో మహిళ మృతి

**ఉద్యమ కెరటం,సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాలో విషాదం చోటుచేసుకుంది. తండాకు చెందిన బానోత్ పద్మ కూలీ పనులకు వెళ్లి పత్తి చేనులో కలుపు తీస్తుండగా పాము కాటుకు గురైంది.పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పద్మ మృతితో వాచ్యానాయక్ తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**ఉద్యమ కెరటం, తాండూర్:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను బుధవారం తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ ఈసా, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టేం విష్ణు కళ్యాణ్,వార్డు సభ్యులు పుల్గం శ్రీకాంత్,యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూరంశెట్టి అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు కంపెల శ్రీనివాస్, అబ్దుల్ మోసిఫ్, నవీన్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల అధ్యక్షురాలు తాహెరా బేగం తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి సారించాలని మాదారం ఎస్సై బి.సౌజన్య సూచించారు. బుధవారం మాదారం పోలీసుల ఆధ్వర్యంలో మాదారం 3 ఇన్‌క్లైన్ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల వివరాలను పరిశీలించారు. అనంతరం ఎస్సై సౌజన్య మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులు కాకుండా విద్య, ఉపాధి, క్రీడలు వంటి రంగాల్లో రాణించాలని అన్నారు. అలాగే మంచిర్యాలలో పోలీస్ ఉద్యోగాల కోసం ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులకు ఉచిత పోలీస్ శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగాల్లో చేరాలనే ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పొందాలని చెప్పారు. యువతకు సరైన మార్గనిర్దేశం అందించడం, సమాజంలో శాంతిభద్రతలను కాపాడటమే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం పోలీసులు పాల్గొన్నారు.

## ఓటీపీలు చెప్పి మోసపోవద్దు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేంసూరు ఎస్సై పల్లెల ప్రదీప్ సూచించారు. వేంసూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని సూచించారు.బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా వివరాలు, ఓటీపీ చెప్పాలని ఎవరైనా అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు వెల్లడించవద్దన్నారు. బ్యాంకు అధికారులు ఓటీపీ, పాస్‌వర్డ్‌లు వంటి సమాచారాన్ని అడగరని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లూకోల్ట్ కానిస్టేబుల్ శ్రీను, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ద్వారకాపూర్‌లో భూ రీ సర్వే ప్రారంభం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని ద్వారకాపూర్ గ్రామ శివారులో బుధవారం భూ రీ సర్వే కార్యక్రమాన్ని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న ప్రారంభించారు. గ్రామ పరిధిలోని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ రీ సర్వే పనులను చేపట్టారు.ఈ సందర్భంగా భూముల సరిహద్దులు, వివరాలను పరిశీలించి సర్వే ప్రక్రియను కొనసాగించారు. భూ రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలు మరింత స్పష్టతతో నమోదు కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకాపూర్ గ్రామ సర్పంచ్ మసాడి తిరుపతి, సర్వేయర్ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

## ఈనెల 5, 6 12, 13 తేదీల్లో నిర్వహణ

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈనెల 5, 6, 12, 13 తేదీల్లో జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రత్యేక ప్రచార కార్యక్రమం జరిగే రోజుల్లో సంబంధిత బీఎల్ఓలు నిర్దేశిత పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే సంబంధిత బీఎల్ఏలు కూడా నిర్దేశిత ప్రదేశాల్లో హాజరవుతారని పేర్కొన్నారు.బీఎల్ఓలు, బీఎల్ఏల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అందులోని తప్పులు, సవరణలు, ఇతర లోపాలను గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు, ఓటర్లు తమకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలకు హాజరై ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవచ్చని సూచించారు.అర్హత కలిగిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, అభ్యంతరాల కోసం సంబంధిత ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. ఇందుకోసంఫారం-6, ఫారం-7, ఫారం-8ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

# బాధిత కుటుంబానికి సర్పంచ్ పరామర్శ



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్‌గూడ గ్రామానికి చెందిన సొన్ కంబ్లే దొండు బాయి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ తొడసం రాజేందర్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి తనవంతు ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఉయిక జ్ఞానేశ్వర్, మాడవి కృష్ణ, సొన్ కంబ్లే జనార్ధన్, గాయక్వాడ్ సతీష్, అన్నారావు, భూతలే కిరణ్, కదం అవినాష్, జంగాలపల్లి బాపూరావు, భూతలే గోవింద్, గాయక్వాడ్ గ్యాను, అమృత తదితరులు పాల్గొన్నారు.

# పొలాల పండుగను ఘనంగానిర్వహించాలి




**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలకుప్రతీకగా నిర్వహించే పొలాల పండుగను మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.పొలాల పండుగ సందర్భంగా ఈనెల10న కన్సేకణి, 11న పొలాల అమావాస్య, 12న బడ్గ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు సాంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని సూచించారు. ఆదివాసీ కుటుంబాలు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేడం గణపత్‌రావు సార్మేడి, ఆత్రం ఆనంద్‌రావు సార్మేడి, మెస్రం భాదిరావు సార్మేడి, ఆత్రం మక్తుర్ష సార్మేడి, జిల్లా అధ్యక్షుడు సెడ్మాకి భగవంత్‌రావు, మాజీ సర్పంచ్ కుంర శ్యాంరావు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుంర చందు, కొద్దు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యిరోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం తల్లాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.నారాయణపురం నుంచి తల్లాడ రింగ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలకు ప్రతీకగా 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. అయితే వెయ్యి రోజులు పూర్తయినా అనేక హామీలు అమలుకు నోచుకోలేదని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.దివ్యాంగులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఉద్యోగులకు పీఆర్సీ విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కల్లూరు, వేంసూరు ప్రాంతాలకు సాగునీరు వస్తున్నప్పుడు తల్లాడ ప్రాంతానికి ఎందుకు నీరు అందడం లేదని ప్రశ్నించారు. తల్లాడ రైతులకు వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం



నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం నెన్నెల మండలంలో పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిత్తాపూర్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న వీఓ భవన పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు.బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించివిద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన ప్రణాళికలు రూపొందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ, ఫారాల స్వీకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమీక్షించారు. అవసరమైన పత్రాలను





నిబంధనల ప్రకారం పరిశీలించి, ప్రక్రియను పారదర్శకంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.గ్రామంలో నిర్మిస్తున్న పంట కుంట పనులను పరిశీలించివర్షపు నీటిని సంరక్షించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులకు తెలిపారు.నెన్నెల మండల సమాఖ్య ఆధ్వర్యంలోని యూనిఫాం కుట్టు కేంద్రాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించాలని సూచించారు.మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని, విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీర్‌ను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఏపీఓ, ఏపీఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం చెన్నూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.చెన్నూర్‌లో నిర్మాణంలో ఉన్న వంద పడకల సామాజిక ఆసుపత్రి పనులను పరిశీలించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రి ప్రహరీగోడ, రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి ప్రహరీ గోడను ఆనుకుని ఏర్పాటు చేసిన టేలాను వెంటనే తొలగించాలని, అనుమతి లేకుండా టేలా ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం చెన్నూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా





పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌తో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిసిబ్బంది హాజరు పట్టిక, తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, నాణ్యమైన విద్యను బోధించాలని తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి హాజరు, గైర్హాజరు, ఇతర విద్యా సంబంధిత అంశాలను ప్రతిరోజూ తెలియజేయాలని ఆదేశించారు.కత్తరశాల గ్రామపంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనామలీ జాబితాలోని ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి వారు సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం సోమనపల్లిలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, విద్యా సౌకర్యాలు అందేలా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు ప్రజాపాలనపై మాట్లాడే నైతిక హక్కు లేదు

- పదేళ్లు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్.
- కాంగ్రెస్‌పై ధర్నాలు చేయడం సిగ్గుచేటు
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలనపై ధర్నాలు చేయడం సిగ్గుచేటని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి దీపద్దారు. కరీంనగర్ ముకరంపురలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో సంతృప్తి ఉందని అన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు కనిపించకపోవడంతోనే రోడ్డెక్కి ధర్నాలు చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధికారిక క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఫ్లెక్సీ తొలగించకపోతే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, దోపిడీపై కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేదో, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న హామీ ఎందుకు అమలు చేయలేదో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని, అలాంటి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదని పేర్కొన్నారు. కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై హద్దులు దాటి మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా స్పందిస్తారని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కార్యక్రమాల్లో పాల్గొంటూ లబ్ధిదారులకు పథకాలను అందిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్.. అదే సమయంలో పథకాలు అమలు కావడం లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, బీఆర్ఎస్ ఎన్ని డ్రామాలు చేసినా ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కుర్ర పోచయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, ముక్క భాస్కర్, భారీ, తోట అంజయ్య, షబాన, గుడిపాటి రమణరెడ్డి, ఫజల్, ఖలీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్సార్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం

- **వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వైఎస్సార్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకమని సత్తుపల్లిఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం సత్తుపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి పూలు సమర్పించి ఆయనను స్మరించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి అండగా నిలిచిన నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమ విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, కమల్ పాషా, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సందీప్ గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ఎన్ఎస్‌యూఐ నాయకులు, వైఎస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సావర్కేడా గ్రామపంచాయతీలో రేషన్ కార్డుల పంపిణీ



**ఉద్యమ కెరటం, సావర్కేడా:** సావర్కేడా గ్రామపంచాయతీలో బుధవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కావుడే తులసీరామ్, వార్డు సభ్యుడు ఎ.శంకర్, జీపీఓ శంకర్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు సకాలంలో అందేలా చర్యలు

- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాహిత్ ఖాన్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** నిరుపేద కుటుంబాలఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి ఆర్థిక సాయాన్ని సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాహిత్ ఖాన్ కోరారు. బుధవారం తహశీల్దార్ నాగార్జునకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 22న కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు మంజూరైనప్పటికీ, కార్యాలయానికి వచ్చిన చెక్కులను సకాలంలో లబ్ధిదారులకు అందించకపోవడంతో వాటి గడువు పూర్తయిందన్నారు. దీంతో చెక్కులను తిరిగి ఆర్డీఓ కార్యాలయానికి పంపించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. చెక్కులు పంపించి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు తిరిగి లబ్ధిదారులకు అందకపోవడం విచారకరమన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదన్నారు. ఇకపై మంజూరైన చెక్కులను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పంపిణీ చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిడ్డప్ప, మహమ్మద్, అయూబ్‌ఖాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ రషీద్, జైనూర్ మార్కెట్ కమిటీచైర్మన్ కుడుమేత విశ్వనాథరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ సీఎంగా నిరుపేదలకు అనేక పథకాల అమలు చేసి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(యు)కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆత్రం శంకర్ రావు, డిసిసి సభ్యులు పేందూరు ప్రకాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, సర్పంచులు ఉయిక చందన్ షావ్ , తొడసం రాజేందర్, ఉయిక చందు,రాందాస్ జానే రావు, విజయలక్ష్మి బీర్సావ్, నిర్మల శశి పాల్ మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ , వార్డు సభ్యులు షేక్ రహీం,షైక్ మజర్ కాంగ్రెస్ నాయకులు మెస్రం అంబాజీరావు, కనక గంగారాం, కోటేష్, ఇస్లాం, షాకీర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిరికొండలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



**ఉద్యమ కెరటం, సిరికొండ:** సిరికొండ మండల కేంద్రంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంచం లక్ష్మణ్ మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, 104 అత్యవసర సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాలను అమలు చేసి రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తోకల రాజు, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జెల్ల సతీష్, మార్కెట్ డైరెక్టర్ చవాన్ ప్రకాష్, మాజీ అధ్యక్షుడు షేక్ ఇమామ్, కొండాపూర్ సర్పంచ్ పట్టేపు లక్ష్మణ్, ఉప సర్పంచ్ బాదు పటేల్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేంసూరులో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మర్లపాడు, భరణిపాడు, కందుకూరు, దుద్దేపూడి, వెంకటాపురం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.మర్లపాడులో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, మండల అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ పేదలు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అత్యాధునిక భద్రత ఫీచర్లతో స్మార్ట్ రేషన్ కార్డులు

**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు**



**ఉద్యమ కెరటం, డోంగ్లి:** తెలంగాణలో ప్రభుత్వం అత్యాధునిక భద్రత ఫీచర్లతో ఏటీఎం కార్డు పరిమాణంలో స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. డోంగ్లి మండల కేంద్రంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు తహశీల్దార్ రంజిత్‌కుమార్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ యజమానిగా మహిళ పేరు మీద కార్డులను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులోకుటుంబ సభ్యులందరి పేర్లు ఒకే కార్డుపై ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రేషన్ షాప్‌లోనైనా సరుకులు పొందేందుకు ఈ స్మార్ట్ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజానంద్ దేశాయ్, డోంగ్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాచావార్ లక్ష్మణ్ పటేల్, సర్పంచులు, నాయకులు ఉమాకాంత్ పటేల్, పరమేష్ పటేల్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# 15లోగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి

- **మద్నూర్‌లో ఐకేపీ సిబ్బంది సమావేశం**

**ఉద్యమ కెరటం, మద్నూర్:** మహిళ సంఘాలు ఈనెల 15వ తేదిలోగా లోకోస్ ప్రొఫైల్ ఎంట్రీ, ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఐకేపీ అధికారి నూకల శ్రీనివాస్ అన్నారు. మద్నూర్ మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం జుక్కల్, మద్నూర్ మండలాల గ్రామ సంఘం సహాయకులు, సీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకోస్ ప్రొఫైల్ ఎంట్రీ, ఈకేవైసీపై అవగాహన కల్పించారు.ప్రతి మహిళా సంఘంలోని సభ్యురాలి వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేసి, ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. దీంతో సంఘాల్లో పారదర్శకత పెరిగి, మెరుగైన అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు జగదీష్‌కుమార్, వందేమాతరం, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



# హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది

- **జుక్కల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసన**



**ఉద్యమ కెరటం, జుక్కల్:** హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జుక్కల్ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేందుకే నిరసన చేపట్టినట్లు తెలిపారు.“మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఎఫ్ ఆర్ ఎస్ విధానంపై సిబ్బందికి శిక్షణ



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ సూచనల మేరకుజిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం మార్గదర్శకత్వంలో బుధవారం నూతన ఎఫ్ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా రిసోర్స్ పర్సన్లు సయ్యద్ అబ్దుల్ రజాక్, సీనియర్ అసిస్టెంట్ వజాహత్ అలీ, జూనియర్ లెక్చరర్ నూతన ఎఫ్ఆర్ఎస్ విధానం, వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి షేక్ సలాం పాల్గొని సిబ్బందికి పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# టాస్ వేయడానికే రోజంతా పడుతుంది

## పాక్‌ను ట్రోల్ చేసిన పీటర్సన్!



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. మూడో టెస్టుకు ముందే మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘాలతో సహా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపివేస్తూ పీసీబీ తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను ఇంటికి పంపి వారి స్థానంలో ఐదుగురు అరంగేట్రం చేయని కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు, మాజీ క్రికెటర్లు పెద్ద ఎత్తున వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఈ పరిణామాలపై ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ తనదైన శైలిలో స్పందించాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌పై హాస్యభరితమైన కామెంట్లు చేశారు. "ప్రతి మ్యాచ్‌కి ముందు జరిగే విలేకరుల సమావేశంలో జట్లలో జరిగిన మార్పుల గురించి వ్యాఖ్యాతలు కెప్టెన్లను అడుగుతారు. ఇప్పుడు నా ఫ్రెండ్ బాబర్‌కు అది చాలా సుదీర్ఘమైన సమావేశం కానుంది. ఈ లెక్కన టాస్ వేసే ఘట్టం మ్యాచ్‌కి ఒక రోజు ముందే ప్రారంభించాలేమో" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా కూడా తన సొంత క్రికెట్ బోర్డుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. "క్రికెట్ చరిత్రలో సిరీస్ మధ్యలో ఒక జట్టు ఇలా ఏడుగురు ఆటగాళ్లను, కోచ్‌లను మార్చడం నేను ఎప్పుడూ చూడలేదు. పాకిస్థాన్ నిజంగా ఒక కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లా ఉంది.. సీజన్ మధ్యలోనే మేనేజర్‌ను తీసేసినట్లు చేస్తున్నారు. మరో పది రోజులు ఆగి సిరీస్ ముగిసాక ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అని రమీజ్ రజా పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు ముందు పాక్ జట్టులో మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, అరాఫత్ మిన్హాస్, ఇమ్రాన్ రంధావా వంటి ఐదుగురు అన్ క్యాప్డ్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. వీరికి తోడు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి వారి స్థానంలో మైక్ హెస్సన్, యాష్లే నాఫ్కేలను నియమించారు. ఎన్నో వివాదాలు, ట్రోల్స్ మధ్య సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఆఖరి టెస్టులో బాబర్ సేన ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

# ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరం

కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్
దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్



భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

# పాక్ క్రికెట్‌ను కుదిపేస్తున్న వివాదాలు





ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ జట్టులో చోటుచేసుకున్న ఊహించని మార్పుల సంచలనం చల్లారకముందే పీసీబీకి మరో పెద్ద షాక్ తగిలింది. పాకిస్థాన్ క్రికెట్ సెలక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్న ఆ జట్టు మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ .. తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ చేతిలో 194 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన తర్వాత పీసీబీ తీసుకున్న నిర్ణయాలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ క్రమంలోనే మిస్బా బోర్డుకు తన నిర్ణయాన్ని వెల్లడించాడు. మూడో టెస్టుకు ముందు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా వంటి ఏడుగురు ప్రధాన ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించడం, అలాగే ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తొలగించడం వంటి నిర్ణయాల్లో మిస్బాను బోర్డు సంప్రదించలేదని తెలుస్తోంది. జాతీయ ఎంపిక కమిటీలో కీలక సభ్యుడిగా ఉన్నప్పటికీ, తన అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై అతడు తీవ్ర అసంతృప్తి చెందాడు. ఈ క్రమంలోనే సెలెక్టర్ పదవితో పాటు లాహోర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీ బ్యాటింగ్ కన్సల్టెంట్ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్ 0-2తో చేజారడం, మూడో టెస్టులో ఘోర పరాభవం నుంచి తప్పించుకునేందుకు పీసీబీ ఏకంగా ఐదుగురు సరికొత్త అన్ క్యాప్డ్ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, మహమ్మద్ ఇమ్రాన్ రంధావా, రాజావుల్లా వంటి యువ ఆటగాళ్లను జట్టులో చేర్చింది. పరిమిత ఓవర్ల జట్టు కోచ్‌గా ఉన్న మైక్ హెస్సన్‌ను టెస్ట్ జట్టుకు కూడా హెడ్ కోచ్‌గా నియమించింది. అయితే గత 20 టెస్టుల్లో 15 ఓటములతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న పాకిస్థాన్ జట్టులో ఈ మార్పులు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో మిస్బా ఉల్ హక్ చాలా ఏళ్లుగా భాగంగా ఉన్నాడు. 2019లో అతడు ఒకే సమయంలో హెడ్ కోచ్, చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత 2020లో చీఫ్ సెలెక్టర్ పదవికి, 2021లో హెడ్ కోచ్ బాధ్యతలకు స్వస్తి చెప్పాడు. తిరిగి 2023లో సలహాదారుగా, 2024 మార్చిలో నాలుగో సభ్యుడిగా సెలక్షన్ కమిటీలో చేరాడు. ఇటీవల ముల్తాన్‌లో జరిగిన జాతీయ ఛాంపియన్స్ కప్‌లో పాకిస్థాన్ గోల్డ్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించి విజేతగా నిలిపారు. కానీ ప్రస్తుత సంక్షోభ పరిణామాల నేపథ్యంలో మిస్బా.. పీసీబీకి పూర్తిగా దూరమయ్యాడు.




# తేలిపోనున్న రోహిత్ భవితవ్యం

## బీసీసీఐ కీలక సమావేశం

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అత్యున్నత స్థాయి సమావేశానికి సిద్ధమైంది. గురువారం ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో ఈ మీటింగ్ నిర్వహించనుంది. ఈ సమావేశానికి సంబంధించిన ఎజెండాను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఐర్లాండ్, ఇంగ్లండ్, శ్రీలంక పర్యటనల్లో భారత జట్టు ప్రదర్శనపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ హాజరుకానున్నారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వర్చువల్‌గా పాల్గొననున్నాడు. సీసీ టీ20 ప్రపంచ కప్ విజయానంతరం.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ జట్టు దారుణంగా విఫలమైంది. వరుసగా 6 టీ20 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించలేకపోయింది. ఈ ఫలితాలపై బీసీసీఐ అప్పట్లోనే ఆందోళన వ్యక్తం చేసింది.ఈ వైఫల్యాలపై ఖచ్చితంగా సమీక్ష చేస్తామని సెక్రటరీ దేవజిత్ సైకియా అప్పట్లోనే మీడియాకు తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల ఈ సమావేశం ఇప్పటి వరకు జరగలేదు.భారత జట్టు ప్రదర్శనతో పాటు భవిష్యత్తు ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ భవితవ్యంపై బీసీసీఐ, సెలెక్షన్ కమిటీల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. వన్డే ప్రపంచకప్ 2027 వనకు రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం కష్టమని వార్తలు వచ్చాయి. రోహిత్ రిటైర్మెంట్ అంటూ కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తలను బీసీసీఐ ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ భవితవ్యంపై కూడా ఈ సమావేశంలో చర్చించినున్నట్లు తెలుస్తోంది. జట్టులో కొనసాగించాలా? వద్దా? అనేదానిపై బీసీసీఐ, మేనేజ్‌మెంట్ ఏకాభిప్రాయానికి రానుంది. ఈ సమావేశం అనంతరం రోహిత్ భవితవ్యంపై స్పష్టత రానుంది.అప్‌కమింగ్ న్యూజిలాండ్ పర్యటనలో అనుసరించాల్సి వ్యూహాలపై కూడా చర్చ జరగనుంది. అంతేకాకుండా జట్టు వేధిస్తున్న ఆటగాళ్ల గాయాల బెడద గురించి సుదీర్ఘంగా చర్చించనున్నారు. ముఖ్యంగా సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌ను వివరణ కోరనున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడగింపుతో పాటు, భారత జట్టు నిర్వహణలో వీవీఎస్ లక్ష్మణ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించే అంశంపై కూడా చర్చలు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్ 18న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కంటే ముందే ఈ ఉన్నత స్థాయి భేటీ జరుగుతుండటంతో.. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు భారత క్రికెట్ భవిష్యత్తును నిర్దేశిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
3 సెప్టెంబర్ 2026

# రజనీ అభిమానులకు పండగ


## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల



సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ వి షయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.




## పవన్‌కు ప్రత్యే ఫోటోతో బన్నీ శుభాకాంక్షలు






ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కెరీర్ ఆరంభం నాటి క్లాసిక్, స్టైలిష్ లుక్‌తో కూడిన ఒక వింటేజ్ పోస్టర్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. 90ల నాటి సినిమా స్టిల్లా అన్నట్లుగా ఉన్న ఈ క్రేజీ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో పవన్ కల్యాణ్ ఒత్తుగా ఉన్న కర్లీ హెయిర్, షార్ప్ లుక్ మరియు బ్లాక్ టీ-షర్ట్‌తో సరికొత్త స్టైలిష్ వైబ్స్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన ట్రిబ్యూట్ పోస్టర్ ద్వారా అల్లు అర్జున్ తన బాబాయ్ పవన్ కల్యాణ్‌పై ఉన్న ప్రేమను, అభిమానాన్ని చాటుకున్నారు. మెగా అభిమానులు సైతం ఈ ఫొటోను సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ చేస్తూ పవన్‌కు బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు.

# కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.





## సంకల్ప సాధకుడు పవన్

### తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, ప్రజలందరూ మెచ్చే నాయకుడిగా తన లక్ష్యాలను సాధించాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ 'ఇట్లు మీ అన్నయ్య చిరంజీవి' అంటూ ఆప్యాయంగా బర్త్‌డే విషెస్ అందజేశారు.



## ఓటిటిలోకి పళ్ల బురుసు

సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ పల్లెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**